**విజయవాడ నగర పోలీస్ కమీషనర్ వారి కార్యాలయము**

**పత్రికా ప్రకటన** **తేదీ : 14-11-2018.**

# దోపిడీ మరియు దొంగతనం కేసులో 10 మంది నిందితుల అరెస్ట్

***వారి వద్ద నుండి సుమారు రూ.2.50 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం***

ది.08.11.2018న విజయవాడ నగర పోలీస్ కమీషనరేట్ నందు సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో దుర్గాపురం ప్రాంతంలో జరిగిన దోపిడీ మరియు దొంగతనం కేసులో అదే రోజు సూర్యారావుపేట పోలీసులు ప్రజల సహాయంతో ముగ్గురు నిందితులు అయిన (1) రమేష్, (2) సురేష్ మరియు (3) తరుణ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడమైనది. మిగిలిన నిందితుల వివరములను వారిదగ్గరె సేకరించినారు. మిగిలిన నిందితుల ఆచూకీపై ప్రత్యేక దృష్టిసారించిన నగర పోలీస్ కమీషనర్ శ్రీ సి.హెచ్.ద్వారకా తిరుమలరావు ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు క్రైమ్ డిసిపి శ్రీమతి బి.రాజకుమారి ఐపిఎస్ గారి స్వీయ పర్యవేక్షణలో సిసిఎస్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ది.14.11.2018న సిసిఎస్ పోలీసు వారికి విజయవాడ పాయకాపురం ఏవిఎస్ రోడ్డు సమీపంలో కొందరి వ్యక్తుల కదలికలు అనుమానాస్పదంగా ఉన్నాయని అందిన సమాచారంపై అక్కడకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు దోపిడీ కేసులో నిందితులుగా అంగీకరించడం జరిగింది.

వీరిలో **(1)** గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రాంతానికి చెందిన పాతూరి ప్రతాప్ (31), **(2)** విజయవాడ పాయకాపురం ప్రాంతానికి చెందిన పూల బాజి (28), **(3)** విజయవాడ పాయకాపురానికి చెందిన గడ్డం శ్రీనివాసరావు (30), **(4)** విజయవాడ కొత్తపేట కు చెందిన పూల ధనలక్ష్మి (57), **(5)** విజయవాడ కొత్తపేటకు చెందిన కొరడాల వాసు (28), **(6)** విజయవాడ కొత్తపేటకు చెందిన చొక్కాకుల శివాజీ (22), **(7)** విజయవాడ కొత్తపేటకు చెందిన గుద్దురి కిరణ్‌కుమార్ (22), **(8)** విజయనగరం జిల్లాకు చెందిన షేక్ బాబూలాల్ (26), **(9)** విజయవాడ అజిత్‌సింగ్ నగర్ ప్రాంతానికి చెందిన యాదర కుమార్ స్వామి (40), **(10)** విజయవాడ వాంబే కాలనీకి చెందిన అబ్దుల్ కరీముల్లా (31)లు చెడు వ్యసనాలకు, జల్సాలకు బానిసై అందినకాడికల్లా అప్పులు చేసి, అప్పులపాలయ్యారు. ఈ క్రమంలో ఏదైనా దోపిడీకి పాల్పడి వచ్చే సొత్తుతో జీవితంలో స్థిరపడాలని నిర్ణయించుకున్న నిందితులు దోపిడీ పథకానికి వ్యూహరచన చేయడం జరిగింది.

***(మిగతా 2వ పేజీలో ...)***

**<u>నేర ప్రణాళిక :</u>**

తాపీపని చేస్తూ జీవనం సాగించే కొరడాల వాసు గతంలో విజయవాడ సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధి దుర్గాపురం ప్రాంతంలో పనికి వెళ్లినప్పుడు ఒక ఇంట్లో అధికంగా నగదు మరియు నగలు గమనించి, ఆ ఇంట్లో దొంగతనం చేస్తే జీవతంలో స్థిరపడొచ్చని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడైన గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రాంతానికి చెందిన పాతూరి ప్రతాప్‌ను కలిసి విషయం చెప్పగా, ప్రతాప్ తనకు పరిచయం ఉన్న విజయవాడ పాయకాపురానికి చెందిన పూల ధనలక్ష్మికి, ఆమె ద్వారా పాయకాపురం ప్రాంతానికి చెందిన కుమార స్వామికి చెప్పగా నలుగురు ఒక ప్రదేశంలో సమావేశమై దోపిడీకి పథక రచన చేసి, దోపిడీకి మరికొంత మంది వ్యక్తుల సహాయం అవసరమనుకున్నారు. ఈ క్రమంలో వాసుకు తెలిసిన రమేష్, బాబూలాల్, కిరణ్ మరియు సూర్యా అనే వ్యక్తులను, ప్రతాప్‌కు తెలిసిన సురేష్, తరుణ్‌లను మరియు ధనలక్ష్మి తన కుమారుడు బాజి మరియు అతని స్నేహితుడు శ్రీనులను కలుపుకున్నారు. ఈ క్రమంలో కుమార స్వామి నేరం చేయడానికి ఉపయోగించేందుకు తన కారును, డ్రైవర్‌ను మరియు కావలసిన నగదును సమకూరుస్తానని చెప్పడం జరిగింది. పథకం అమల్లో భాగంగా నిందితులు తొలుత కొన్నిసార్లు నేరం చేయడానికి ఎంచుకున్న ఇంటి పరసర ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించడం జరిగింది.

ది.08.11.2018న ఉదయం 10 గం॥ల సమయంలో విజయవాడ సింగ్‌నగర్‌లో నిందితులంతా కలుసుకుని ముందుగా బాజి మరియు శ్రీనులు రెక్కీ నిర్వహించారు. అనంతరం మిగిలిన నిందితులు ప్రతాప్ ఆధ్వర్యంలో కుమార్ స్వామి పంపిన కార్లో రమేష్, కిరణ్, సూర్య, సురేష్, తరుణ్ మరియు బాబూలాల్‌లు నేరం చేయడానికి ఎంచుకున్న ఇంటికి చేరుకుని, వెంట తెచ్చుకున్న మాస్క్‌లు ధరించి ఇంట్లోకి ప్రవేశించారు. అనంతరం ఇంట్లో ఉన్న వారిని వెంట తెచ్చుకున్న కత్తులతో బెదిరించి, వారిని కొట్టి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు తీసుకుని పారిపోవడం జరిగింది. దోపిడీకి పాల్పడి పారిపోతున్న నిందితులను గమనించిన ఆ చుట్టు ప్రక్కల నివాసితులు నిందితులను వెంబడించి రమేష్, సురేష్ మరియు తరుణ్‌లను పట్టుకుని పోలీసు వారికి అప్పగించగా ముగ్గురు నిందితులను ది.8.11.18న అరెస్ట్ చేసి **U/S 395, 397, 201, 120(B)** ప్రకారము రిమాండ్‌కు తరలించడం జరిగింది. కేసు దర్యాప్తులో భాగంగా దోపిడీలో ప్రత్యక్షంగా పాల్గొన్న నిందితులను మరియు నేరానికి సహకరించిన నిందితులను ది.14.11.18న అరెస్ట్ చేసి, వీరి వద్ద నుండి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించడం జరిగింది.

-- xx --